క్లుప్తంగా

అధినేత వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్ భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బుధవారం పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ భేటీ అయ్యారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసి పలు అంశాలను వివరించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని రెల్లివీధికి చెందిన కుంచుమాంబ కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు లక్షా 11 రూపాయలు విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, అక్షింతలు అందజేశారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న సత్యనారాయణస్వామి

పెందుర్తి: ఆషాడ చివరి ఏకాదశి సందర్భంగా పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



తయారు చేసిన ఆకృతులతో విద్యార్థులు

పెందుర్తి: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సృజనాత్మకతతో వివిధ ఆకృతులను రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో రవీంద్రభారతి ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి వెంకటేశ్, ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పాలు అమృతతుల్యం



- నవజాత శిశువుకు రోగనిరోధక శక్తి వృద్ధి
- బిడ్డకు పాలిస్తే అమ్మకూ ఆరోగ్యం
- తల్లిపాల విశిష్టతపై మహిళలకు అవగాహన
- నేటి నుంచి వారోత్సవాలు

అమ్మ.. ఆ పదంలోనే అనురాగం, ఆప్యాయత మిళితమై ఉంటాయి. నవజాత శిశువుకు తల్లి పాలే తొలిటీకా అని అంటారు. జన్మించిన వెంటనే పట్టే ముర్రుపాల నుంచే బిడ్డ పోషణ ఆరోగ్యకరంగా ప్రారంభమవుతుంది. అయితే, కొందరు అపోహలతో శిశువుకు ముర్రుపాలు పట్టేందుకు అయిష్టత చూపడంతో భవిష్యత్తులో చిన్నారులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తల్లిపాల విశిష్టతపై మహిళలకు అవగాహన కల్పించేందుకు ఏటా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.



గొల్లివానిపాలెంలో పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది(ఫైల్)



అమృతపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న సిబ్బంది(ఫైల్)

సబ్బవరం: నవజాత శిశువులకు బలం చేకూర్చే ఆహారం తల్లిపాలే అని వైద్య నిపుణులు చెబుతున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లి పాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడిస్తున్నారు. అందుకే తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తూ ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నామని సీడీపీవో లలిత్ కుమారి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తారని తెలియజేశారు.

ఆరు నెలల పాటు తల్లిపాలే ఆహారం

కాన్పు అయిన మొదటి కొద్ది రోజులపాటు తల్లి పాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రు పాలు అంటారు. ఇందులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. వీటిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని పెంచే గుణం ఉంటుంది. ముర్రు పాలతో శిశువులు చక్కగా పెరుగుతారని వైద్యులు తెలియజేస్తున్నారు. అలాగే, ఆరు నెలల పాటు తల్లి పాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుందని.. శ్వాసకోశ సమస్యలు, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయని చెబుతున్నారు. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయని తెలిపారు. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలని, ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలియజేస్తున్నారు. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలని వివరిస్తున్నారు.

ముర్రుపాలు పట్టించాలి



పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలి. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందునుంచే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కార్యక్రమాన్ని 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తాం.

– లలిత్ కుమారి, సీడీపీవో, సబ్బవరం

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: సబ్బవరం సెక్షన్–2 పరిధిలోని 33/11 కేవీ,అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

4న భువనేశ్వరీదేవి అధివాసం



భువనేశ్వరీదేవి అమ్మవారు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధిలోని మణిపురంలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో ఈ నెల 4వ అమ్మవారి అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తామరపత్రితో అమ్మవారికి మంగళస్నానాలు చేయించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సంజీవరావు సేవలు మరువలేనివి



సంజీవరావును సత్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ మేనేజర్ కె.సంజీవరావు సేవలు మరువలేనివని విశాఖ ఉక్కు కార్మిక సంఘాల నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సంజీవరావు, ఆశాలత దంపతులను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ తన సర్వీస్ కాలంలో మచ్చలేని అధికారిగా ఉద్యోగుల మన్ననలు పొందారన్నారు. ఆయన ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్.రావు, యు.రామస్వామి, కొమ్మ ప్రసాద్, శ్రీనివాస్‌నాయుడు, బి.వెంకటరావు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉదయం స్లాట్‌లో ఓపీ సేవలు బంద్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉదయం మొదటి స్లాట్‌లో ఓపీడీ సేవలు నిలిచిపోనున్నాయి. ఆస్పత్రిలో సాధారణంగా ఉదయం రెండు స్లాట్లు, మధ్యాహ్నం రెండు స్లాట్లలో ఆన్‌లైన్‌లో జరిగే రిజిస్ట్రేషన్ ద్వారా ఓపీ డిపార్ట్‌మెంట్ సేవలు అందిస్తుంటారు. నెట్ సర్వర్‌లో సమస్య తలెత్తడంతో ఉదయం 8 నుంచి 10 వరకు ఉన్న స్లాట్‌లో ఓపీడీతో పాటు రిపీట్ మెడిసిన్ సేవలు పనిచేయబోవని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉద్యోగులు అర్థం చేసుకుని, సహకరించాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ దేశాభివృద్ధికి ఆటంకం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

ఎంవీపీ కాలనీ: బాల కార్మిక వ్యవస్థ అనేది ఏ దేశం సమ్మిళిత అభివృద్ధికైనా ఆటంకం కలిగించే అంశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్ అంశంపై జర్నలిజం విభాగం సమావేశ మందిరంలో బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, సామాజిక వెనుకబాటు తనంతో పాటు అనేక అంశాలు చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్‌కు దారితీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ వంటి సంస్థలు, ఎన్జీవోలు ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు అన్వేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత, సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ డైరెక్టర్ ఆచార్య సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రైలు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే రైలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంగళవారం తెల్లవారు జామున జరిగిన రైలు ప్రమాదంపై ఆయన స్పందించారు. 10 ఏళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరిగా స్పందించడం లేదన్నారు. సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం వంటివి చేయడం లేదని, ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. రైల్వేలో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోవడం, సిబ్బంది సమస్య వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో హడావుడి చేస్తున్నారే గానీ.. సాధారణ, మధ్యతరగతి రైళ్లపై, ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తరచూ జరుగుతున్న రైలు ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎంపీలు ప్రశ్నిస్తున్నా.. దేశవ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా.. స్పందించని రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాలని రాజు డిమాండ్ చేశారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సత్య వెంకట భాస్కరరావు

అగనంపూడి: చేసిన అప్పులు తీర్చలేనన్న బాధతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ గ్లోరియా స్కూల్‌కు సమీపంలో తగరంపూడి వెంకట సత్య భాస్కరరావు (50) భార్య రత్నకుమారి, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నారు. భాస్కరరావు సమీపంలోని డెయిరీ ఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ అందినచోటల్లా అప్పులు చేశాడు. సుమారు రూ.75లక్షల వరకు అప్పులు చేయడం, తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో మానసిక ఆందోళనకు గురై కొద్దిరోజుల పాటు భీమవరం వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం నుంచి తిరిగి వచ్చిన భాస్కరరావు బాత్‌రూమ్‌లోకి వెళ్లి పురుగుల మందు సేవించాడు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాత్‌రూమ్ నుంచి వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయిన భాస్కరరావును భార్య రత్నకుమారి చుట్టు పక్కల వారి సహాయంతో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్ట్ కార్మికునికి వైద్యం చేయించాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకోపోవడంపై ఉక్కు సీఐటీయూ... ప్రధాన కార్యదర్శి పట్టా రామ అప్పారావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అగనంపూడి దిబ్బపాలేనికి చెందిన గొల్లవిల్లి సన్యాసిరావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని నవ్య రమేష్ అనే కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉండగా అక్కడి సిబ్బంది కన్వేయర్‌ను ఆపరేట్ చేయడంతో అక్కడే ఉన్న సన్యాసిరావు కాళ్లు కన్వేయర్‌లో నుజ్జయ్యాయి. ఆదుకోవాల్సిన కాంట్రాక్టర్ ఈఎస్ఐ సౌకర్యం ఉందని చెప్పి తప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

3న తుపాకీ సంస్కృతిపై సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా హెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై ఈ నెల 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రపంచ శాంతిని కోరే మేధావులు సామాజిక కార్యకర్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి, అబ్దుల్ మునీర్, ముషాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



పూడి గంగమ్మ

సీతమ్మధార: సీతమ్మధారలో నివసిస్తున్న పూడి గంగమ్మ అనే వృద్ధురాలు శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు 95733 22882 నంబర్‌కు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



పరవాడలో వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో వీధి కుక్కల నియంత్రణకు పాలకవర్గం చర్యలు చేపట్టింది. గ్రామ సింహాలతో గుబులు అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వీధి కుక్కలను నియంత్రించాలని మండల పంచాయతీ విస్తరణాధికారి కె.రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు ఆధ్వర్యంలో గ్రామంలో సంచరిస్తున్న వీధి కుక్కల ఏరివేత కార్యక్రమానికి సిబ్బంది బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో రహదారులు, సంతబయలు, వీధులు, మాంసం, చేపల దుకాణాల వద్ద సంచరిస్తున్న 30 గ్రామ సింహాలను వలపన్ని పట్టుకొని మారికవలస వద్ద శునకాల కుటుంబ నియంత్రణ చికిత్స కేంద్రానికి తరలించారు. ఈ నెల 4న మరోసారి వీధి కుక్కలను ఏరి వేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు చెప్పారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



ట్రైనీలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో ఆర్నెల్ల పాటు నిరుద్యోగ యువతకు కల్పించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో సిన్హా మాట్లాడారు. నిరుద్యోగ యువతకు విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సహకారంతో శిక్షణ అందించినట్టు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్లతో పాటు శతశాతం హామీతో కూడిన జాబ్ ఆఫర్ లెటర్లను ప్రాజెక్టు హెడ్ సిన్హా అందజేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

గొటివాడ ఆరోగ్య కేంద్రానికి గుర్తింపు

సేవల్లో రెండో స్థానం



గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో సర్పంచ్ సాలాపు మీనా తదితరులు

సబ్బవరం: గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో మండలంలోని గొటివాడ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి తెలిపారు. గత నెల 4వ తేదీన ఎన్‌కాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్) ప్రొగ్రామ్‌లో భాగంగా ఢిల్లీ నుంచి డాక్టర్ రాజేశ్వర్,డాక్టర్ జయలక్ష్మి బృందం ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించిందని చెప్పారు. రోగులతో మాట్లాడి కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారన్నారు. గ్రామంలోని పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారన్నారు.ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు వైద్య సిబ్బందిని సర్పంచ్ సాలాపు మీనా వెంకటేశ్వరరావు దంపతులు అభినందించారు.కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత,సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాసు,ఆర్ శిరీష, ఏఎన్ఎం సుధారాణి, కె.శివ అప్పలనాయుడు,పైడిరాజు,కృష్ణవేణి,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

1266వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, మూడు సంవత్సరాలు టాక్స్ హాలిడే ప్రకటించాలని ఉక్కు సిటూ నాయకులు ఎస్.రామారావు, జె.అయోధ్యరామ్, ఎం.ఎస్.ఎన్.మూర్తి, పెదిరెడ్ల నీలకంఠం కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1266వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ లెటర్ ఆఫ్ కంఫర్ట్ ఇవ్వాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని లేదా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే వ్యాగన్లు కేటాయించాలని, మూడు వేల కోట్ల మేరకు ప్రిఫరెన్షియల్ షేర్లు కేంద్ర ప్రభుత్వం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సాగుతున్న నిర్మాణాలైన అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టు నిర్మాణ పనులకు విశాఖ ఉక్కును కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యు.రామస్వామి, వై.టి.దాస్, కృష్ణారావు, టి.వి.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటి చెత్తను అప్పుడే తరలించాలి



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: యార్డులో చెత్తను ఏ రోజుకు ఆ రోజు కాపులుప్పాడ తరలించి యార్డును జీరో చేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును, క్లోజ్ కాంపెక్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్–3, 4, 5 ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తను వెంటనే యార్డుకు తరలించాలన్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడకు పంపిచాలన్నారు. క్లోజ్ కాంపెక్ట్ వాహనాల్లో సామర్థ్యం మేర పంపించాలన్నారు. తక్కువగా పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా రోడ్డుపైన డెబ్రిస్, సిల్ట్, ఇసుక ఉండకూడదన్నారు. వాటిని కూడా జీవీఎంసీ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ముఖ్యంగా యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తకు ప్లాస్టిక్ కవర్లు చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణరాజు, మెకానికల్ ఈఈ దిలీప్, ఇంజినీరింగ్ ఈఈ సంతోష్‌కుమారి, ఏఈ జాన్సన్, ఏఎంహెచ్‌వో ఎ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఫోర్త్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్‌లోని ధార కొండపై గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడులు చేశారు. గొల్లలపాలేనికి చెందిన వానం నవీన్, అవాల అశోక్‌కుమార్, నక్కవానిపాలేనికి చెందిన నక్కల కార్తీక్‌ల వద్ద నుంచి రెండు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రిటైర్డ్ తహసీల్దార్ రవికి సన్మానం

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ తహసీల్దార్‌గా పని చేస్తున్న వీకేఎస్ రవి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో సీతారామ్మూర్తి, పరిపాలనాధికారి (ఏవో) కె.వి. ఈశ్వరరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.